క్లుప్తంగా

ఎల్‌వోసీ అందజేత



ఎల్‌వోసీ అందిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మల్యాల: మండలంలోని నూకపల్లి గ్రామానికి చెందిన ఆలకుంట నవీన్ అనారోగ్యంతో నిమ్స్‌లో చికిత్స పొందుతుండగా, వైద్య ఖర్చుల కోసం చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను సంప్రదించగా, రూ.3 లక్షల ఎల్‌వోసీ మంజూరు చేయించారు. బాధిత కుటుంబానికి బుధవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు అందజేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బత్తిని మల్లేశ్వరి శ్రీనివాస్ గౌడ్, మాజీ జెడ్పీటీసీ మారంపల్లి లక్ష్మణ్, డైరెక్టర్లు పాల్గొన్నారు.

మెట్‌పల్లి వాసికి ఆర్మీలో పదోన్నతి



పదోన్నతి బ్యాడ్జీలు పెడుతున్న ఉన్నతాధికారులు

మెట్‌పల్లి: పట్టణానికి చెందిన ఆకుల ఆనంద్ ఆర్మీలో జాయింట్ కమాండ్ అధికారిగా పదోన్నతి పొందారు. 2005లో సోల్జర్‌గా ఆర్మీలో ఉద్యోగానికి ఎంపికైన ఆనంద్ ఆ తర్వాత వివిధ హోదాల్లో పని చేసి ప్రస్తుతం కీలకమైన జాయింట్ కమాండ్ అధికారిగా నియమితులయ్యారు. కొంతకాలంగా ఉత్తరప్రదేశ్‌లోని ఝాన్సీ కంటోన్మెంట్‌లో విధులు నిర్వహిస్తున్న ఆయనకు ఈ బాధ్యతలను ఉన్నతాధికారులు అప్పగించారు. వ్యవసాయ కుటుంబానికి చెందిన ఆనంద్ ఆర్మీలో ఉన్నత స్థాయికి ఎదగడం పట్ల కుటుంబ సభ్యులు అతని స్నేహితులు హర్షం వ్యక్తం చేశారు.

'హిందూ ఏక్తా యాత్ర' వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న బీజేపీ నాయకులు

కథలాపూర్: ఈనెల 22న కరీంనగర్‌లో జరిగే హిందూ ఏక్తా యాత్ర వాల్ పోస్టర్‌ను బుధవారం బీజేపీ ఆధ్వర్యంలో నాయకులు ఆవిష్కరించారు. హిందూ ఏక్తా యాత్రలో హిందువులు, అభిమానులు అధికసంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు మల్యాల మారుతి, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు కొడిపెల్లి గోపాల్‌రెడ్డి, నాయకులు వెంకటేశ్వర్‌రావు, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పాం సాగు చేయండి



మాట్లాడుతున్న ఏఈవో మౌనిక

కథలాపూర్: రైతులు ఆయిల్‌పాం సాగు చేయాలని ఏఈవో మౌనిక, ఆయిల్‌పాం మండలాధికారి శ్రావణ్ కోరారు. కథలాపూర్ మండలం దూలూర్ గ్రామంలో బుధవారం రైతులకు ఆయిల్‌పాం పంట సాగుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎకరానికి 57 మొక్కలు నాటాల్సి ఉంటుందని, ఒక్కో మొక్కకి రూ. 20 చొప్పున రైతులు చెల్లిస్తే మిగతా డబ్బులు ప్రభుత్వం భరిస్తుందన్నారు. ఆయిల్‌పాం పంట సాగు చేస్తే 4 ఏళ్ల నుంచి 30 ఏళ్ల వరకు నిరంతరం ఆదాయం సమకూరుతుందన్నారు. సమావేశంలో మాజీ సర్పంచులు లక్ష్మినర్సయ్య, గంగాధర్, రైతులు పాల్గొన్నారు.

ప్రజలకు అండగా 'సురభి ఫౌండేషన్'



ప్లాంట్ ప్రారంభిస్తున్న నవీన్

మెట్‌పల్లిరూరల్: ప్రజలకు ఎల్లవేళల సురభి ఫౌండేషన్ అండగా ఉంటుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, ఫౌండేషన్ చైర్మన్ సురభి నవీన్‌కుమార్ అన్నారు. మెట్‌పల్లి మండలం పాటిమీది తండాలో సురభి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సొంత నిధులతో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను బుధవారం ప్రారంభించారు. సురభి ఫౌండేషన్ సేవలను మరింత విస్తరింపజేస్తామన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి తన వంతుగా కృషి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

అద్దె భవనాలు.. అరకొర వసతులు

- సౌకర్యాలు లేక అంగన్‌వాడీ టీచర్లు, చిన్నారుల అవస్థలు
- సొంత భవనాలు కరువు
- చిన్నారులను పంపించని తల్లిదండ్రులు



బతికపల్లిలో అద్దె ఇంట్లో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రం

పెగడపల్లి: మండలంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలు అరకొర వసతులతో అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. టీచర్లు, చిన్నారులు, లబ్ధిదారులు ఇబ్బంది పడుతున్నారు. వసతులు లేని కారణంగా కేంద్రాలకు చిన్నారులను ఎలా పంపగలమని వారి తల్లిదండ్రులు చెబుతున్నారు.

పెగడపల్లి మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాలకు సొతత భవనాలు కరువయ్యాయి. ఏళ్ల నుంచి అద్దె ఇళ్లల్లో కొనసాగుతున్నాయి. దీంతో కనీస వసతులు కరువై చిన్నారులు, కార్యకర్తలు అవస్థలు పడుతున్నారు. వసతుల లేమి కారణంగా చిన్నారులకు ఆటపాటలతో చదువు చెప్పేందుకు ఇబ్బంది పడుతున్నామని టీచర్లు వాపోతున్నారు. చిన్నారుల కోసం పంపించిన చార్టులు కూడా గోడలకు అటించలేని దుస్థితి. మండలంలోని 23 గ్రామాల్లో 52 అంగన్‌వాడీ కేంద్రాలుండగా కమ్యూనిటీ భవనాల్లో 15 కొనసాగుతుండగా, 17 కేంద్రాలకు మాత్రమే సొంత భవనాలున్నాయి. 20 కేంద్రాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. దోమలకుంట, ఏడుమోటలపల్లి తాండా, నామాపూర్ శివారు గ్రామం గొల్లపల్లె గ్రామాల్లో నిర్మించనున్న అంగన్‌వాడీ కేంద్ర భవన నిర్మాణాలు నిధుల లేమితో నిలిచిపోయాయి. బతికపల్లిలో భవనం ఉన్నా నిరుపయోగంగా ఉంది. కనీసం రూ. 2500 కిరాయి చెల్లిస్తేనే ఓ మోస్తారు వసతులున్న ఇళ్లు కిరాయికి లభించలేని పరిస్థితి ఉన్న నేపథ్యంలో వీరికి చెల్లిస్తున్న కిరాయి రూ. వెయ్యి నుంచి 1500 మాత్రమే. ఇవి కూడా ప్రతీ నెలకు సక్రమంగా ఇవ్వక పోవడంతో తామే వేతనాల నుంచి చెల్లించాల్సి వస్తోందని అంగన్‌వాడీ టీచర్లు వాపోతున్నారు. సరైన వసతులు లేకపోవడంతో పిల్లలను పంపించేందుకు తల్లిదండ్రులు వెనుకాడుతున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల పనితీరుపై ప్రభుత్వం పటిష్టమైన చర్యలు చేపట్టి ఆన్‌లైన్ విధానానికి శ్రీకారం చుట్టింది.

సరుకుల పంపిణీలో పారదర్శకత

కేంద్రాల్లోని లబ్ధిదారులకు ఫేస్ అథెంటికేషన్ ఆధారంగా సరుకుల పంపిణీ జరుగుతోంది. ఆన్‌లైన్ విధానం అమల్లోకి తేవడంతో అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు విధుల పట్ల అంకితభావంతో పనిచేస్తూ సమయ పాలన పాటిస్తున్నారు. కేంద్రాల్లో ఆంగ్లం మీడియంతో పాటు ప్రాథమిక విద్యాబోధన అమలు చేస్తూ పౌష్టికాహారం అందిస్తున్నారు. వసతులు లేక అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాల్సిన చిన్నారులను వారి తల్లిదండ్రులు ప్రైవేట్ స్కూళ్లకు పంపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక చొరవచూపి అన్నింటికి పక్కా భవనాలు నిర్మించాలని అంగన్‌వాడీ టీచర్లు, చిన్నారుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ప్రభుత్వానికి నివేదించాం



అంగన్‌వాడీ కేంద్రాల్లో నెలకొన్న సమస్యలపై ప్రభుత్వానికి నివేదించాం. సొంత భవనాలు లేని అంగన్‌వాడీ కేంద్రాలకు అందుబాటులో స్థలం ఉన్నచోట శాశ్వత భవనాలు నిర్మించేందుకు నిధుల మంజూరు కోసం ఉన్నతాధికారులకు, ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. శిథిలావస్థలో ఉన్న పక్కా భవనాలను తొలగించి నూతన భవన నిర్మాణాలకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది.

– వీరలక్ష్మి, సీడీపీవో, మల్యాల ప్రాజెక్టు

పేదల కడుపు నింపేందుకే సన్నబియ్యం పంపిణీ



రేషన్ షాప్ ప్రారంభించి బియ్యం పంపిణీ చేస్తున్న జువ్వాడి నర్సింగరావు, నాయకులు

మల్లాపూర్: పేదలు కడుపునిండా భోజనం చేసేందుకే సీఎం రేవంత్‌రెడ్డి సన్నబియ్యం పంపిణీకి శ్రీకారం చుట్టారని కాంగ్రెస్ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. మండలంలోని సంగెం-శ్రీరాంపూర్‌లో మహిళా సంఘానికి కేటాయించిన కొత్త రేషన్‌షాప్‌ను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు రాబోయే రోజుల్లో రేషన్‌షాప్‌ల ద్వారా మరిన్ని సరుకులు పంపిణీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ప్రజలకు, రైతులకు ఇచ్చిన హామీలన్నింటిని కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేరుస్తుందన్నారు. బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి దేవర సురేశ్‌రావు కాంగ్రెస్ పార్టీలో చేశారు. కొత్తదాంరాజుపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పరిశీలించారు. కార్యక్రమాల్లో మార్కెట్ కమిటీ చైర్మన్ అంతడపుల పుష్పలత నర్సయ్య, వైస్ చైర్మన్ ఇట్టెడి నారాయణరెడ్డి, మాజీ ఎంపీపీ నల్ల రాజన్న, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

భూసారం పెరిగేందుకు పచ్చిరొట్ట ఎరువులు వాడాలి

ఇబ్రహీంపట్నం: భూసారం పెంపునకు ఖరీఫ్‌లో పచ్చిరొట్ట ఎరువులు ఎక్కువగా వాడాలని మండల వ్యవసాయ అధికారి రాజ్‌కుమార్ తెలిపారు. రసాయన మందుల వలన భూమి సారవంతం తగ్గుతుందని, దీంతో పంట తక్కువ దిగుబడి వస్తుందని, రసాయన ఎరువులకు ప్రత్యామ్నాయంగా పచ్చిరొట్టను ఉపయోగించాలన్నారు. పచ్చిరొట్ట ఎరువులు వాడటంతో అనేక లాభాలు ఉన్నాయని, పచ్చిరొట్ట పైర్లు ఎరువుల లాగానే కాకుండా పశువుల మేతకు కూడ ఉపయోగపడుతుందని రైతులు పచ్చిరొట్ట ఎరువులపై ఆసక్తి చూపాలని తెలిపారు. మండలానికి త్వరలో 540 క్వింటాళ్ల జనుము, జిలుగు విత్తనాలు వస్తాయని పేర్కొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి



రికార్డులు పరిశీలిస్తున్న డీపీఎం, అధికారులు

కథలాపూర్: ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని సెర్ప్ డీపీఎం మల్లేశం అన్నారు. మండలంలోని భూషణరావుపేట, చింతకుంట, తాండ్ర్యాల గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను సందర్శించి, రికార్డులను పరిశీలించారు. మండలంలో ఇప్పటివరకు 1.19 లక్షల క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేశామన్నారు. మండలంలో ఏడు కొనుగోలు కేంద్రాల్లో కొనుగోళ్లు పూర్తయ్యాయని, మిగతా ఐదు కేంద్రాల్లో రెండు రోజుల్లో పూర్తి చేయాలని నిర్వాహకులకు సూచించారు. ఆయన వెంట డీపీఎం విజయభారతి, ఏపీఎం నరహరి, సీసీలు అశోక్, అంజయ్య ఉన్నారు.

ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేయాలి

ఇబ్రహీంపట్నం: ధాన్యం కొనుగోళ్లు ఐదు రోజుల్లో పూర్తి చేయాలని తహసీల్దార్ ప్రసాద్ సిబ్బందికి సూచించారు. బుధవారం మండలంలోని గోధూర్, వేములకుర్తి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. గోధూర్‌లో 60 మంది రైతుల ధాన్యం కుప్పలు, వేములకుర్తి కేంద్రంలో 70 మంది రైతులు ధాన్యం కుప్పలు ఉన్నట్లు గుర్తించారు. అకాల వర్షాలు పడుతున్నందున హమాలీలను ఎక్కువగా పెట్టి కొనుగోళ్లు వెంటనే పూర్తి చేసి ధాన్యాన్ని లారీల్లో మిల్లులకు తరలించాలని సిబ్బందికి తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటి తహసీల్దార్ ప్రసాద్, కొనుగోలు కేంద్రాల సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

భూమాతకు బూరెల నైవేద్యం



బూరెలు నైవేద్యంగా సమర్పిస్తున్న మహిళలు

కోరుట్ల రూరల్: మండలంలోని పైడిమడుగులో మహిళలు బుధవారం బూరెలను భూమాతకు నైవేద్యంగా సమర్పించారు. ఇటీవల జగిత్యాల జిల్లాతో పాటు పలు చోట్ల భూమి కంపించిన విషయం తెలిసిందే. దీంతో మహిళలు భూమాతకు బూరెలు సమర్పిస్తే శాంతిస్తుందనే నమ్మకంతో గ్రామ శివారులోని ఓ చెట్టు వద్ద భూమిని కొంత గుంత చేసి బూరెలను పెట్టి పసుపు కుంకుమతో పూజించారు. అనంతరం గుంతను పూడ్చి మహిళలంతా కలిసి బూరెలు తిన్నారు. బూరెల సమర్పణతో భూమాత శాంతిస్తుందని మహిళలు పేర్కొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



పోటీలు ప్రారంభిస్తున్న కాంతకుమారి

గొల్లపల్లి: మండలం లోని భీం రాజ్‌పల్లి గ్రామంలో నిర్వహించనున్న క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రభుత్వ విప్ సతీమణి కాంతకుమారి బుధవారం ప్రారంభించారు. సీజన్ 2 క్రికెట్ టోర్నమెంట్ నిర్వాహకులు, బీబీకే ఫౌండర్ కుమార్‌ను కాంతకుమారి అభినందించారు. క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీ ప్రారంభించి మాట్లాడారు క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని, ఆటలతో యువత ఆరోగ్యంగా ఉంటారని యువత క్రీడలపై దృష్టి సారించాలన్నారు. క్రీడల్లో యువత రాణించి రాష్ట్రానికి దేశానికి పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి



ధాన్యం పరిశీలిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

రాయికల్: అకాల వర్షంతో తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని బీఆర్ఎస్ మండల నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం మండలంలోని అల్లీపూర్ గ్రామంలోని కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎలాంటి ఆంక్షలు లేకుండా ప్రభుత్వం స్పందించి కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బర్కం మల్లేష్ యాదవ్, చాంద్ పాషా, నాయకులు అనుమల మహేశ్, రాజమౌళి, సాగర్‌రావు, గంగాధర్, రామ్ రెడ్డి పాల్గొన్నారు.

బీరప్ప జాతరలో చల్మెడ



చల్మెడను సన్మానిస్తున్న కురుమలు

మేడిపల్లి: భీమారం మండలంలోని రాజలింగంపేట (రత్నాలపల్లె)లో బీరప్ప జాతర అంగరంగ వైభవంగా జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వేములవాడ బీఆర్ఎస్ వేములవాడ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహరావు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ తులఉమ, మండల అధ్యక్షుడు క్యాతం సత్తిరెడ్డి, చెన్నమనేని అజిత్‌రావు, ఉదిగిరి ఆదిరెడ్డి, మకిలీదాసు, బీనవేని రెడ్డి, ఉరుమట్ల చిన్నరాజం తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి

మల్యాల: విద్యుత్ తీగలు తెగిపడడంతో విద్యుదాఘాతంలో పాడి గేదె మృతిచెందిన సంఘటన మల్యాల మండలం తాటిపల్లిలో చోటుచేసుకుంది. నందెల్లి లక్ష్మారెడ్డికి చెందిన పాడి గేదె బుధవారం స్థానిక రైతు వేదిక వద్ద మేత మేస్తుండగా, మంగళవారం వీచిన ఈదురుగాలులకు విద్యుత్ తీగలు తెగిపడడంతో, మేతమేస్తూ వెళ్లి విద్యుదాఘాతంతో మృతిచెందింది. సుమారు రూ.70 వేల విలువైన పాడి గేదె మృతి చెందిందని రైతు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

రాయికల్: మండలంలోని అల్లీపూర్, అయోధ్య గ్రామాల్లో పల్లె దవాఖాలను మాజీ సీఎం కేసీఆర్ హయాంలో మంజూరయ్యాయని బుధవారం బీఆర్ఎస్ నాయకులు కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ తానే మంజూరు చేయించానని చెప్పుకోవడం సరికాదని హితవు పలికారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బర్కం మల్లేష్ యాదవ్, మహేష్, రాజమౌళి, సాగర్ రావు, రాజారెడ్డి ఆశలు తదితరులు పాల్గొన్నారు .



కథలాపూర్: మండలంలోని ఊట్‌పెల్లి గ్రామశివారులో ఊర చెరువు మత్తడి నుంచి నీరు పోయే కాలువలో చెత్తా చెదారం పడేయడంతో డంపింగ్‌యార్డును తలపిస్తుందని గ్రామస్తులు పేర్కొన్నారు. వర్షకాలంలో చెరువు నిండి మత్తడి నుంచి నీళ్ల వెళ్లకుండా ఈ చెత్తచెదారం అడ్డుగా మారిందన్నారు. అధికారులు దృష్టి సారించి కాలువలో చెత్తను పడేయకుండా డంపింగ్ యార్డులో వేసేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
రాజశేఖర్, ఎంపీవో, కథలాపూర్, సెల్ నం: 9640807073

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

అకాల వర్షాలతో రైతులకు తిప్పలు



కొనుగోలు కేంద్రంలో నిలిచిన వర్షపునీరు

మేడిపల్లి: అకాల వర్షంతో కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం చాలా చోట్ల తడిసిపోయింది. రైతులు వారి ధాన్యం రక్షించుకోవాడానికి నానా పాట్లు పడాల్సిన దుస్థితి ఏర్పడింది. ఉన్నతాధికారులు ధాన్యం నిలవ్యలు తూకం వేసి త్వరగా కొనుగోళ్లు పూర్తి చేయాలని ఆదేశిస్తున్న, కొన్ని సెంటర్లలో ధాన్యం నిల్వలు ఇంకా అలానే ఉండిపోయాయి. చాలా చోట్ల హమాలీలు లేక కొనుగోళ్లలో జాప్యం జరుగుతోంది. సెంటర్లలో సదుపాయాలు కల్పించి ఇప్పటికైనా ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేయాలని రైతులు కోరుతున్నారు.

క్వయిల్ పక్షుల పెంపకంపై రైతులకు శిక్షణ



కరపత్రం ఆవిష్కరిస్తున్న డాక్టర్లు

కోరుట్ల రూరల్: పట్టణ శివారులోని పీవీ నర్సింహారావు వెటర్నరీ విశ్వ విద్యాలయంలో బుధవారం క్వయిల్ పక్షుల పెంపకంపై జాతీయ మాంస పరిశోధనా సంస్థ సహకారంతో రైతులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ అసోసియేట్ డీన్ దాసరి శ్రీనివాస్ క్వయిల్ పక్షుల పెంపకం యొక్క ప్రాముఖ్యతను వివరాంచారు. కర పత్రాన్ని ఆవిష్కరించారు. పశు గణన క్షేత్ర అధిపతి డాక్టర్ శ్రీదేవి క్వయిల్ పక్షుల పెంపకంతో గ్రామీణులకు జీవనోపాధి లభిస్తుందన్నారు. క్వయిల్ పక్షుల మాంసం, గుడ్ల ప్రాముఖ్యతను వివరించారు.యాజమాన్య పద్ధతులు, గృహ నిర్వహణ, దాణా నిర్వహణ, వ్యాధుల నివారణ చర్యలపై వివరించారు. కార్యక్రమంలో డాక్టర్లు, పకారం, కీర్తన, సౌమ్య, సుష్మ, శిరీష, రవికాంత్, సురేశ్, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్ క్రీడాకారిణికి స్వాగతం



ఐశ్వర్యకు స్వాగతం పలుకుతున్న పట్టణ వాసులు

ధర్మపురి: ఏషియన్ చాంపియన్‌షిప్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభను చాటిన క్రీడాకారిణి శ్యాంరావ్ ఐశ్వర్యకు బుధవారం సాయంత్రం ఘన స్వాగతం పలికారు. ధర్మపురికి చెందిన శ్యామ్‌రావ్ ఐశ్వర్య ఈనెల 5 నుండి 12 వరకు డెహ్రాడూన్ ఉత్తరాఖండ్‌లో ఏషియన్ చాంపియన్‌షిప్ పవర్ లిఫ్టింగ్ పోటీలను నిర్వహించారు. పోటీల్లో శ్యాంరావ్ ఐశ్వర్య 52 కిలోల బరువునెత్తి బంగారు పతకం సాధించి ధర్మపురికి చేరింది. బుధవారం సాయంత్రం క్రీడాకారిణిని బ్యాండు మేళాలు, డీజే సౌండుల మధ్య గొప్ప ఊరేగింపుగా తీసుకెళ్లారు. క్రీడాకారిణిని పూలమాల శాల్వాలతో ముంచెత్తారు. స్థానిక దుర్గమ్మకాలనీ నుండి అంబేద్కర్, గాంధీ, నందీ చౌక్‌ల మీదుగా భారీ ఊరేగింపు చేశారు. కార్యక్రమంలో కాలనీ వాసు, స్థానికులు భారీగా తరలివచ్చారు.

నేడు ప్రజావేదిక

కథలాపూర్: మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఉపాధిహామీ పథకం సామాజిక తనిఖీ ప్రజావేదిక గురువారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శంకర్ తెలిపారు. వారం రోజులపాటు ఉపాధిహామీ పనులను గ్రామాల్లో పరిశీలించిన అధికారులు, సిబ్బంది ప్రజావేదికలో ప్రస్తావిస్తారన్నారు. పనులపై సందేహాలుంటే ప్రజావేదిక దృష్టికి తీసుకురావచ్చని ఎంపీడీవో పేర్కొన్నారు.

ఇసుక డంపులు స్వాధీనం

సారంగాపూర్: బీర్‌పూర్ శివారు గ్రామం మోతీనగర్ వాటర్‌ట్యాంక్ వద్ద బుధవారం అధికారులు ఇసుక డంపులు స్వాధీనం చేసుకుని ఇసుకను సీజ్ చేశారు. పక్కా సమాచారంతో తహసీల్దార్ ముంతాజొద్దీన్, ఆర్ఐ ఎం.రాహుల్ అక్కడికి చేరుకున్నారు. ఇసుక కనిపించకుండా టార్పాలిన్ కవర్లు కప్పి, వాటిపై పశుగ్రాసం (గడ్డికట్టలు) కట్టలు వేశారు. అధికారులు గుర్తించి, ఇసుకను సీజ్ చేసి, పోలీసులకు అప్పగించారు.

మాజీ సర్పంచ్ మృతి

రాయికల్: మండలంలోని చింతలూరు గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ లక్ష్మణ్ నాయక్ (91) అనే వృద్ధుడు అనారోగ్యంతో బుధవారం మృతి చెందాడు. 2006 వ సంవత్సరంలో ఎస్టీ జనరల్ కేటాయించగా లక్ష్మణ్ నాయక్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మాజీ సర్పంచ్ మృతి పట్ల గ్రామస్తులు వివిధ పార్టీ నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.